విద్యార్థులున్నారు.. ఉపాధ్యాయులే లేరు!

- ఉర్దూ పాఠశాలను వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- మ్యాథ్స్, సైన్స్ టీచర్లు లేక విద్యార్థుల ఇబ్బందులు
- యూట్యూబ్ ద్వారా సిలబస్ కొనసాగిస్తున్న వైనం



దాదాభాయ్ నౌరోజీ మున్సిపల్ ఉర్దూ హైస్కూల్


తరగతి గది లేక వరండాలోనే క్లాసు వింటున్న విద్యార్థులు

గుంతకల్లుటౌన్: విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసి వాటి రూపురేఖలనే మార్చేస్తామన్న కూటమి ప్రభుత్వ మాటలు నీటిమీద రాతలుగా మారాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రభుత్వ ఉర్దూ పాఠశాల విద్యార్థుల పాలిట శాపంగా మారింది. పట్టణంలోని దాదాభాయ్ నౌరోజీ మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులు చదువుకునేందుకు వెళ్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో పాఠాలు బోధించే ఉపాధ్యాయుల్లేక వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు కీలకమైన సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయుల్లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

తొమ్మిది మందికిగాను నలుగురే..

పట్టణంలోని హనుమేష్‌నగర్‌లో గల దాదాభాయ్ నౌరోజీ మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో మొత్తం 92 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఈ పాఠశాలలో హెచ్‌ఎంతో కలిపి 9 మంది ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ప్రస్తుతం హెచ్‌ఎంతో పాటు తెలుగు, సోషల్, ఇంగ్లిష్ సబ్జెక్టులకు మాత్రమే ఉపాధ్యాయులున్నారు. ఉర్దూ టీచర్ వేరే పాఠశాలకు బదిలీ అయినప్పటికీ రిలీవ్ చేయకుండా ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఇక కీలకమైన మ్యాథ్స్, బయాలజీ, ఫిజిక్స్ సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులతో పాటు పీఈటీ కూడా లేరు. గత్యంతరం లేక యూట్యూబ్ ద్వారా ఐఎఫ్‌పీ(ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) బోర్డులను కనెక్ట్ చేసి అడపాదడపా క్లాసులను కొనసాగిస్తున్నారు. అసలే కొంత మంది విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులంటేనే భయపడతారు. పాఠశాల ప్రారంభమయ్యి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కీలకమైన సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులను నియమించకపోగా కనీసం ఇతర పాఠశాలల నుంచి టీచర్లను డిప్యుటేషన్‌పై సర్దుబాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కుంటున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కొత్తటీచర్లు వచ్చే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

తరగతి గదుల కొరత కూడా..

ఈ పాఠశాలలో తరగతి గదుల కొరత కూడా ఉంది. ఐదు క్లాసులకు కలిపి కేవలం నాలుగు తరగతి గదులున్నాయి. 6వ తరగతి విద్యార్థులైతే ఆరుబయట వరండాలో కూర్చుని చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. హెచ్‌ఎం, ఆఫీసు రూమ్‌లకైతే ప్రత్యేకమైన గదులే లేవు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధ్యాయులతోపాటు తరగతి గదుల సమస్యను తీర్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఖాళీలను భర్తీ చేయాలని కోరాం

డీబీఎన్ ఉర్దూ హైస్కూల్‌లో ఖాళీగా ఉన్న టీచర్ల పోస్టులను భర్తీ చేయాలని విద్యాశాఖ అధికారులను కోరాము. నాది మ్యాథ్స్ బ్యాగ్రౌండ్ సబ్జెక్టు కావడంతో రోజుకో రెండు క్లాసులు చెబుతున్నాను. మిగిలిన సబ్జెక్టులను యూట్యూబ్ సహకారంతో ప్యానల్ బోర్డు ద్వారా వివరిస్తున్నాము. కొత్త టీచర్లు వచ్చే వరకు ఇబ్బందులు తప్పవు.

– రవికుమార్, పాఠశాల హెచ్‌ఎం, డీబీఎన్, ఉర్దూ హైస్కూల్

డీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు చర్యలు



డీబీఎన్ ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టు టీచర్ల ఖాళీలున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని విద్యాశాఖ ఉన్నతాధికారులకు కూడా తెలియజేశాను. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టిన వెంటనే ఖాళీలను భర్తీ చేసి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

– మస్తాన్‌రావు, ఎంఈఓ, గుంతకల్లు.

క్లుప్తంగా

స్వమిత్వ సర్వేతో ప్రజల ఆస్తులకు భద్రత


మాట్లాడుతున్న ఈఓపీఆర్‌డీ శశికళ

యాడికి: స్వమిత్వ సర్వేతో గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలతో పాటు ప్రభుత్వ రంగ ఆస్తులను సరిహద్దులతో సహ భద్రత కలుగుతుందని ఈఓఆర్‌డీ శశికళ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో స్వ మిత్వ సర్వేపై బుధవారం సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటితో పాటు రోడ్లు, చెరువులు, పార్కులు, ఆలయాలు, అంగనవాడీ , హెల్త్ సెంటర్లు, పంచాయతీ ఆస్తులు వంటివి సర్వే చేయాలన్నారు. సరైనా దస్తావేజులు లేని కారణంగా తమ సొంత ఇళ్లపై బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు జరపని వారికి స్వమిత్వ కార్డుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసే అవకాశం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సాయి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) పూర్వ విద్యార్థి చట్టనాథన్ సహకారంతో కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. మంగళవారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థి చట్టనాథన్ చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు డాక్టర్ జనార్దన్ శాస్త్రి, పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ జాకీర్‌హుసేన్, అధ్యాపకులు డాక్టర్ గోపినాయక్, డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.

గుత్తిలో హర్ ఘర్ తిరంగా


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో బుధవారం బీజేపీ నాయకులు, పట్టణ ప్రజల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు వెంకప్ప నేతృత్వంలో స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి జాతీయ జెండాలను చేత పట్టుకుని రాయల్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రతి ఒక్కరూ దేశ భక్తిని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ విగ్రహాలు

పెద్దపప్పూరు: తురుకపల్లిలోనూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం సీతారామలక్ష్మణ విగ్రహప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో పూజలు చేపట్టారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణల నడుమ విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. పెద్దయక్కలూరు, కొండాపురం, చెర్లోపల్లి, రెడ్డిపల్లి, చిన్నయక్కలూరు, యాడికి మండలం కొత్తపల్లి తండా గ్రామాలను నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. గ్రామపెద్దల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన హాజీవలి

గుత్తి: పట్టణ శివారులోని తాడిపత్రి రోడ్డుపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామానికి చెందిన హాజీవలి బైక్‌పై పని నిమిత్తం గుత్తికి వచ్చాడు. పని ముగించుకుని ఊరికి వెళుతుండగా మార్గమధ్యలో మరో బైక్ ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన హాజీవలిని స్థానికులు గమనించి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ ఐల్యాండ్ తొలగింపు


వాసవీ థియేటర్ సమీపంలోని ట్రాఫిక్ ఐల్యాండ్‌ను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

గుంతకల్లు: పట్టణంలోని సంత మార్కెట్ సమీపంలోని వాసవీ థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐల్యాండ్‌ను అధికారులు తొలగించారు. బుధవారం సాక్షిలో 'నిరుపయోగంగా ట్రాఫిక్ సర్కిళ్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు వాసవీ థియేటర్ సమీపంలో నాలుగు రోడ్ల కలిసే ఇరుకైన ప్రాంతంలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ ఐల్యాండ్, భారీ బ్యానర్, అపోలో సర్కిల్ ట్రాఫిక్ సర్కిల్ పాయింట్‌కు ఏర్పాటు చేసిన బ్యానర్ తొలగించారు. దీంతో ఆయా సర్కిళ్ల వద్ద వాహనాల రాకపోకలకు కొంతమేర ఇబ్బందులు తొలిగాయని వాహనాదారులు పేర్కొంటున్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్

గుత్తి రూరల్: సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం పెద్దొడ్డి గ్రామ సచివాలయాన్ని ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. రోజు బయో మెట్రిక్ ద్వారా తప్పకుండా హాజరు వేయాలన్నారు. పీ–4, గ్రామ, వార్డు సచివాలయ రెగ్యులర్ సర్వేలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


గుంతకల్లులో ధర్నాకు మద్దతు తెలిపిన ఏపీఎన్‌జీఓ నాయకులు

గుంతకల్లుటౌన్: ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులకు పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు చెల్లించాలని ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ నేతలు బుధవారం డిపో ఎదుట చేపట్టిన ధర్నాకు ఏపీఎన్‌జీఓ నాయకులు మద్దతు తెలిపారు. ఏపీఎన్‌జీఓ అధ్యక్షురాలు సంపూర్ణ ఎస్తేర్, నాయకులు రామాంజనేయులు, చాంద్ బాషా మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ రాష్ట్ర కార్యదర్శి ఎర్రిస్వామి, డిపో కార్యదర్శి నటరాజ్, నాయకులు రహంతుల్లా నాగసుధ, మురళీకృష్ణ, గోవిందమ్మ, నారాయణమ్మ, సలీమాబీ, ఎన్‌జీఓ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: డిమాండ్ల సాధన కోసం ఆర్టీసీ కార్మికులు బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట రెండో రోజూ ధర్నా చేపట్టారు. డిమాండ్ల పరిష్కారం కోసం పలు మార్లు చర్చలు జరిపినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే పెండింగ్‌లోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్‌ఎంయూఏ డిపో సెక్రటరీ బాబు, డిపో ప్రెసిడెంట్ మహేశ్వరరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రంగయ్య, గ్యారేజ్ సెక్రటరీ రామకృష్ణ, అడ్వైజర్ యేసోజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు


ఊబిచెర్లలో పంటలను పరిశీలిస్తున్న ఆర్‌ఎస్‌కే సిబ్బంది

గుత్తి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని గుత్తి డివిజన్ ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. ఊబిచెర్ల గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయంపై ఆర్‌ఎస్‌కే సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌కే సిబ్బందికి ఏటీఎం, ఏ–గ్రేడ్, పీఎండీఎస్ పంటలను చూపించి వాటి సాగుపై అవగాహన కల్పించారు. ప్రతి ఆర్‌ఎస్‌కే ఉద్యోగి ఏటీఎం మోడళ్లను అనుసరించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన అహారాన్ని తీసుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచే బాధ్యత ఆర్‌ఎస్‌కే సిబ్బందిదేనన్నారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది సుభాన్‌బాషా, అరుణ, బ్యూల, వసుంధర, మల్లిక పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏడీఏ కార్యాలయం వద్దగల గోడౌన్‌లో బుధవారం ఆర్‌ఎస్‌కే సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏటీఎం, ఏగ్రేడ్, పీఎండీఎస్ పంటల సాగును వివరించారు. ఘన జీవామృతం, ద్రవ జీవామృతం తయారీని తెలియజేశారు. తాడిపత్రి ఏడీఏ రవి, ఏఓ ఆంజనేయులు, వివిధ మండలాలకు చెందిన ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: మండల కేంద్రంలో ముస్లిం, మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ గెస్ట్ టీచర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు బుధవారం తెలిపారు. పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.16,100 వేతనం చెల్లిస్తామన్నారు. వివరాలకు 8712625062 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న వైద్య సిబ్బంది

శింగనమల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ తెలిపారు. బుధవారం తరిమెల పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు తప్పనిసరిగా ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం వారికి వైఎస్సార్‌సీపీ నాయకులు తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, సర్పంచ్ ఓబిలేసు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లలిత, సూపర్‌వైజర్ నాగమ్మ, చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

గార్లదిన్నె: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా ఎరువులు విక్రయించి పంచాయతీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీపీఓ నాగరాజునాయుడు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని యర్రగుంట్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డీపీఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం ద్వారా వర్మీకంపోస్టు తయారీ చేసి రైతులకు విక్రయించి పంచాయతీని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలన్నారు. గ్రామంలో ఇళ్ల ముందర చెత్త వేయకుండా పంచాయతీ కార్మికులు ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల బాధ్యులకు నోటీసులు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకుకు సంబంధించిన రావలసిన మొండి బకాయిల బాధ్యులకు నోటీసులు పంపుతామని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని టౌన్ బ్యాంకు అవరణలో బుధవారం బ్యాంకు జనరల్ బాడీ సమావేశం జరిగింది. జేసీ మాట్లాడుతూ బ్యాంకుకు సంబంధించిన సక్రమమైన పూచీ కత్తు లేకుండా రుణాలు మంజూరు చేయడంలో సంతకాలు పెట్టిన సిబ్బందికి నోటీసులు పంపిస్తామన్నారు. అవసరమైతే వారు తనఖా పెట్టిన ఆస్తులను వేలం వేయిస్తామన్నారు. అనంతపురం, గుత్తి టౌన్ బ్యాంకుల చైర్మన్లు మురళి, జిలాన్‌బాషా, తాడిపత్రి బ్యాంకు సీఈఓ వెంకటలక్ష్మి తదితరులు హాజరయ్యారు.


11వార్డు పాఠశాలలో సంచరిస్తున్న పందులు

పాఠశాలలో పందుల సంచారం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సుంకులమ్మ కాలనీ సమీపంలోనున్న 11వార్డు పాఠశాల ఆవరణలో పందుల సంచారంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఆవరణలో యథేచ్ఛగా తిరుగుతూ విద్యార్థుల పై దాడి చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

పాఠశాల గేటు బయటే మధ్యాహ్న భోజనం వ్యర్థాలు వేస్తుండటంతో పందులు గుంపులు గుంపులుగా పాఠశాలలోకి చొచ్చుకొస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. అధికారులు స్పందించి పందుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

పోరాట ఫలితంగానే సమస్యల పరిష్కారం

గుంతకల్లుటౌన్: సీఐటీయూ అనుబంధమైన ఆశావర్కర్స్ యూనియన్ పోరాట ఫలితంగానే ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కారమయ్యాయని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో ఆశావర్కర్లు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తమ పోరాటంతో గ్రాట్యుటీ, 180 రోజుల ప్రసూతి సెలవులు, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు ప్రమీళ, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

యాడికి: సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ వెంకటేష్ సూచించారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, పోక్సో చట్టాలు, శక్తి యాప్‌పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, స్నాప్ చాట్, లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. ఆడపిల్లలకు సమస్యలు ఎదురైనప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి సహకరించండి

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీసమేత బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆలయంలో బుధవారం నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ పురావస్తుశాఖ అనుమతితో దేవాలయ రూపు రేఖలు మార్చడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. ఆలయ జీర్ణోద్ధరణకు దాతలు ముందుకు రావాలన్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్‌గా చంద్రమోహన్‌నాయుడు, సభ్యులుగా పార్వతి, రంగనాథరెడ్డి, కవిత, రంజిత్, భారతి, రఘు, కో– అఫీషియల్ మెంబర్‌గా అర్చకులు శంకరయ్య ప్రమాణం చేశారు.

17న కంటి వైద్య శిబిరం

పామిడి: స్థానిక భావసార క్షత్రియ కల్యాణ మండపంలో ఈనెల 17న పామిడి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు, అధ్యక్షుడు కే రఘువీర్ రావ్ బుధవారం తెలిపారు. శిబిరానికి వచ్చే వారు రెండు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్‌ఫోటోలు, సెల్‌ఫోన్ నంబర్‌తో రావాలన్నారు. వివరాలకు 9440550000, 9866589899 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్సీల భూములను కాపాడండి

బుక్కరాయసముద్రం: జంతలూరు గ్రామంలో ఎస్సీలకు కేటాయించిన ప్రభుత్వ భూములను కాపాడాలని దళిత సంఘం నాయకులు చిన్న ఆంజనేయులు, చంద్ర పేర్కొన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్ 256లో ఎస్సీలకు 5 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. అయితే ఓ రెవెన్యూ అధికారి తన పేరును అక్రమంగా రికార్డులోకి ఎక్కించుకున్నారన్నారు. అక్రమాలకు పాల్పడిన అధికారిపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు.

16న కల్లూరులో శ్రీకృష్ణాష్టమి

గార్లదిన్నె: కల్లూరులో ఈనెల 16న త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక కల్లూరు కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ కల్లూరులో 16 నుంచి 20 వరకు వేడుకలు నిర్వహిస్తామన్నారు. చివరి రోజు కృష్ణుడి విగ్రహం ఊరేగింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివరాం ప్రసాద్, చిరంజీవి, నరేష్, సుధాకర్, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి– ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు సమితి సభ్యులు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం కృష్ణాష్టమి వేడుకల ప్రతులను పంపిణీ చేశారు.